
# పెళ్ళికి సూత్రాలు

'రజని'



శీతాకాలవు ఉదయం -

తొమ్మిది గంటలైనా కాకముందే నగరం రోడ్లన్నీ ఆఫీసు జనంతో, బడిపిల్లలు, కాలేజి కుర్రకారుతో నిండిపోయాయి. ఎటు చూసినా హడావుడి. ఆ వేళకి ప్రత్యూష చిక్కడపల్లి బస్ స్టాప్ దగ్గరకి వస్తుందని తెలుసు శశాంకకి. అరగంట నుంచి ఆమె కోసం పడిగాపులు కాస్తూ నిలుచున్నాడు. కొత్త గ్రే కలరు సూటు వేసుకుని నల్ల కళ్ళద్దాలు పెట్టాడు. ప్రత్యూష వచ్చీరాగానే ఆమె దృష్టిని ఆకర్షించాలని అద్దం ముందు గంటసేపు నిలబడి శ్రద్ధగా తయారయ్యాడు.

ప్రత్యూష వాళ్ళ ఇల్లు అతని గదికి రెండు మూడు వీధుల అవతల ఉంది. మరో పది నిమిషాలకి ప్రత్యూష... అహ కాదు - దేవలోకం నుంచి దిగి వస్తున్న దేవత... కనిపించింది. పాల నురుగులాంటి తెల్లని షిఫాన్ చీర, పొడవాటి జడ, చక్రాల్లా తిరుగుతూ మిలమిలా మెరిసిపోయే కళ్ళు, కాంతు లీనే మోము, మంత్రముగ్ధుడై కాసేపు తన్మయత్వంగా అలాగే చూస్తుండిపోయాడు.

అతడిని చూడగానే నవ్వొచ్చింది ప్రత్యూషకి. సరిగ్గా త నొచ్చే వేళకి కాలు కాలిన పిల్లిలా పచార్లు చేస్తూ అలా బస్ స్టాప్‌లో అతను వేచి ఉండటం మామూలే. ఈ మధ్యనే అతని గురించి వివరాలు మాటల్లో తెలిశాయి.

ఎం.కామ్. చదివి ఆబిడ్స్‌లో ఓ ప్రైవేటు ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రత్యూష తన గురించి చెప్పబోతే అడ్డుకున్నాడు.

"నాకు తెలుసు. మీరు బాంకులో పనిచేస్తున్నారు. మీరు, బహుశా మీ అమ్మగారు అనుకుంటాను షాపింగ్‌కి వస్తే చూశాను. మీ స్వగ్రామం అమలాపురం దగ్గర వాడపల్లి కదూ! ఆంధ్రా వర్సిటీలో ఫిజిక్స్ చేసి గోల్డు మెడల్ కొట్టేశారు. ఉద్యోగం ప్రారంభించి కూడా రెండు మూడేళ్ళయిందేమో."

గడగడా అతను చెబుతుంటే కాస్త తెల్లబోయింది.

"ఇవన్నీ మీ కెలా తెలుసు?"

"భలేవారండీ. మనకి కావలసిన వాళ్ళ గురించి ఆ మాత్రం శ్రద్ధ తీసుకుని కనుక్కోలేమా చెప్పండి." అన్నాడు కొంచెం చొరవగా.

అలా రెండు మూడు నెలలు గడిచేసరికి అతని చొరవ మెల్లిమెల్లిగా అర్థంకావడం మొదలుపెట్టింది.

శశాంక ఆ రోజు ఆమె అభిప్రాయం అడిగేయాలనే నిర్ణయించుకున్నాడు. ప్రత్యూష కాదనదనే ధీమా కూడా వచ్చింది. నిజానికి తనకేం తక్కువ? అరడుగుల అందగాడు. తన పర్సనాలిటీ చూసి ఫ్రెండ్సంతా అసూయ వెళ్ళగక్కుతూ ఉంటారు. కంపెనీలో రేపో మాపో ప్రమోషన్ కూడా రాబోతోంది. అప్పు డెలాగు స్కూటర్ ఆఫీసు వాళ్ళు ఇస్తారని ఇప్పుడు కొనడం మానేశాడు.

"ఇంత ఆలస్యంగా వస్తున్నారేమండీ! మీ కోసం అరగంట నుంచీ ఎదురుచూస్తున్నాను"

అన్నాడు మొహమంతా విప్పార్చుకుని.

"అసలు నేను వచ్చే టైము కరెక్టుగా ఇదే. అంతకుముందే వచ్చి నా కోసం చూస్తున్నారంటే మీ ఖర్మ" అని మనసులో విసుక్కుని పైకి మర్యాదపూర్వకంగా నవ్వి ఊరుకుంది.

"మీకు అభ్యంతరం లేకపోతే సాయంత్రం అలా ఇందిరాపార్క్ వైపు వస్తారా?" అని అభ్యర్థించాడు.

ప్రత్యూష మొదట ఆశ్చర్యపోయినా తరవాత ఒప్పుకుంది. అతని ధోరణికి ముగింపు చెప్పాలనే ఆమె కూడా నిర్ణయించుకుంది.

పార్కులో పచ్చగడ్డి తెంపుతూ, కొన్ని గడ్డిపరకలు కొరుకుతూ శశాంక కొంతసేపు గడిపాడు. ప్రేమికులు అలానే ఉండాలని చాలా పుస్తకాల్లో చదివాడు మరి.

ఎదురుగా ఉన్న పూల మొక్కలని అమితమైన సీరియస్‌నెస్‌తో చూస్తూ హఠాత్తుగా అడిగాడు.

"ప్రేమ మీద మీ అభిప్రాయం ఏమిటి?"

"మీ రనేదేమిటి? ఒట్టి ఆషామాషి ప్రేమనా లేక వివాహం వరకు వెళ్లే ప్రేమ లాటిదా?"

అప్పటికి తన ప్రశ్న అసంపూర్తిగా ఉందని తోచి బుర్ర కొట్టుకున్నాడు.

"అదే... మీ రన్నదే కరెక్టు. ప్రేమ వివాహం."

"మంచిదే. ఎవరైనా ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకుంటే నా దృష్టిలో గొప్ప ఆదర్శవంతులే!" ప్రత్యూష నిజాయితీగా, నిశ్చలంగా చెప్పింది.

శశాంక మనసు ఆనందంతో వెంటనే గంతులు వేసింది.

"నేను కూడా అలాగే అనుకుంటానండీ. ఇంత చదువుకుని ఉద్యోగం చేస్తూ తీరా పెళ్లి విషయం వచ్చేరికి అమ్మా నాన్న మీద ఆధారపడటం పాతచింతకాయ పచ్చడి."

"ఈ విషయంలో నేను అనుకునేదీ అదే. జీవిత భాగస్వామిని ఎవరికి వారే ఎంపిక చేసుకోవాలి. కానీ దురదృష్టం చూడండి. మన సమాజంలో అలాంటి పరిస్థితులు చాలా తక్కువే ఉన్నాయి కదా" అంది ఆమె కొంచెం నిస్పృహగా.

"అదే పొరపాటు. ఇలా ఎవరికి వారు వెనకడుగు వేయడం వల్లనే సమాజంలో ప్రగతి అనేది కనిపించడం లేదండీ." శశాంక ఆవేశంతో చెప్పుకుపోయాడు.

"కానీ... మీరు ఆడవాళ్లని కూడా దృష్టిలో పెట్టుకుని ఆలోచించండి. వారికి ఉన్న అడ్డంకులతో సూటిగా 'మిమ్మల్ని ప్రేమించాను' అని ఎవరికైనా చెప్పగలరా. సాధారణంగా ఆడపిల్లలు తమ ఆలోచనలకు తామే కళ్లెం వేసుకుని మౌనంగా ఉండిపోతున్నారు."

"అలా జరగకూడదు ప్రత్యూష గారూ! ప్రేమ అనే సున్నిత భావానికి, అది ఏర్పడే పొదరిల్లు లాంటి హృదయానికి ఆడా, మగా తేడా లేదండి! ప్రేమ అనేది వయసులో కలిగే సహజమైన ఆలోచన. ఆడపిల్లలు కూడా ఆ భావాన్ని అణచివేయడానికి ప్రయత్నించకూడదు. ఎవరైనా మంచి వ్యక్తి తటస్థపడి 'ఐ లవ్ యూ' అంటే దృష్టిలో పెట్టుకోవాలి."

ఆమె మౌనం చూసి శశాంక విజృంభించాడు.

"ఉదాహరణకి నేనే ఉన్నాననుకోండి. మీరు నాకు ఆర్నెల్ల నుంచీ పరిచయం. దాదాపు ఓ మంచి స్నేహితునిగా నా మీద మీకు ఒక అభిప్రాయం ఏర్పడే ఉంటుంది. అది పెళ్లికి దారితీస్తే ఎలా ఉంటుంది?"

ప్రత్యూష వెంటనే ఏమి చెప్పాలో తెలియక తికమకపడింది.

"సరె. టైము తీసుకోండి. ఈ మధ్య ఇంగ్లీషు సినిమాలు ఏమేం చూశారు?"

"నేను తెలుగు సినిమాలే చూడటం మానేసి చాలా రోజులైంది. ఇక ఇంగ్లీషు సినిమాలు అసలు చూడను."

శశాంక కొంచెం కంగుతిన్నాడు. అతను వారానికి మూడు తెలుగు సినిమాలు, ఆదివారంనాడు ఓ ఇంగ్లీషు సినిమా తప్పనిసరిగా చూస్తాడు.

"సరే. మన తెలుగు నవలా రచయితల్లో ఎవరిని ఎక్కువ అభిమానిస్తారు?"

"నిజం చెప్పాలంటే ఇప్పటి రచయితల పేర్లు కూడా నాకు తెలియదు. మనసు ఆరోగ్యంగా ఉండాలంటే ఆ సాహిత్యం జోలికి పోకుండా ఉంటేనే బాగుంటుందేమో" అంది ప్రత్యూష.

శశాంక ముఖం పేలవంగా మారిపోయింది. తెలుగులో వస్తున్న ప్రతి కొత్త నవలని కంఠోపాఠంగా చదువుతాడు. ఆ రచయిత లంతా అతనికి ఆరాధ్య దైవాలు.

"నే నెప్పుడైనా తెలుగు నవలలు తిరగేస్తూ ఉంటా లెండి" అన్నాడు జీవంలేని నవ్వుతో.

"ఎప్పుడూ నేనే ప్రశ్నలు వేస్తున్నాను. ఈసారి మీరు అడగండి" అన్నాడు.

"నేనా! ఏ మడగను?"

"అదే... కట్నాలు, కానుకలు, పెళ్లిళ్లు జరిగే పద్ధతులు వీటి మీద నా ఉద్దేశాలు చెప్పమంటారా?"

శశాంక మళ్లీ ఉత్సాహం తెచ్చుకున్నాడు.

"ముందుగా వరకట్నం విషయం మాట్లాడుకుందాం.

"అసలు కట్నం అన్న పదమే నాకు పడదండీ. వరకట్నాన్ని వ్యతిరేకిస్తూ కాలేజి డిబేటు పోటీల్లో ఫస్ట్ ప్రైజ్ కూడా గెలుచుకున్నాను" అన్నాడు ఒకింత గర్వంగా.

ప్రత్యూష కొంచెం విస్తుపోయింది.

"ఫరవాలేదు మీకు కొన్ని ఆదర్శ భావాలు ఉన్నాయన్నమాట."

"కొన్నేం ఖర్మ? అసలు పూర్తిగా ఆదర్శవంతుడిననే చెప్పుకోవాలి. అందరు అబ్బాయిల్లా నేను పెళ్లి బాధ్యతని మా అమ్మా నాన్న మీద తోసెయ్యలేదు. నా కిష్టమైన అమ్మాయిని కానీ కట్నం లేకుండా చేసుకుంటానని ఛాలెంజ్ చేసి వచ్చాను" అన్నాడు.

నిజానికి వాళ్లమ్మ నాన్న అతనికి చాలా సంబంధాలే చూసి ఇక విసిగిపోయి మానేశారు.

వాళ్లకి మంచికట్నం వచ్చే సంబంధం కావాలి. అతనికి అమ్మాయి సౌందర్యరాశి అయి ఉండాలి.

ఈ రెంటికీ జత కలవలేదు.

'నీ క్కావలసిన పిల్లని నువ్వే ఎంచుకో అని వాళ్లు చెప్పేశారు.

శశాంక దృష్టిలో తల్లిదండ్రులు అమాయకులు - వాళ్లవన్నీ పాత లెక్కలు బూజుపట్టిన పద్ధతులు - ఇప్పటి రోజుల్లో కట్నం ఎవరికి కావాలి? అమ్మాయి చక్కగా, అందంగా ఉండి అంతకంటే అందమైన ఉద్యోగం చేస్తుంటే కావలసిందేముంది? ఒకే దెబ్బకి రెండు పిట్టలు. అటు కట్నం అక్కరలేదన్న ఆదర్శ పురుషుడిగా భార్య వైపు వాళ్లలో పెరిగే గౌరవ ప్రతిష్ఠలు, ఇటు జీతం రూపంలో ప్రతి నెలా వచ్చిపడే నిత్యసంపద!

"అబ్బాయి లంతా నాలాగే సదుద్దేశాలు కలిగి ఉంటే మన సమాజంలో వరకట్న సమస్య అనేది ఉండదు. ప్రేమ వివాహాలు వర్ధిల్లుతున్నాయి. ఏమంటారు?" అన్నాడు ముఖానికి పట్టిన చెమటని ససుతారంగా రుమాలుతో వత్తుకుంటూ.

"సరే.. రేపు మాట్లాడుకుందాం" అని ప్రత్యూష ఆ రోజుకి తప్పించుకుంది.

నిజానికి ఆ రోజు రాత్రి శశాంకని గురించి ఆమె ఆలోచించనే లేదు. దిండు గలీబులకి ఎంబ్రాయిడరీ చేస్తూ ఆ విషయమే మరిచిపోయింది.

మర్నాడు మళ్లీ బస్ స్టాప్‌లో శశాంక అదే పాత పాట 'నా బ్రతుకును సుందరవనంలోకి నడిపించే మీ అంగీకారం - కోసం చకోర పక్షిలా ఎదురుచూస్తున్నాను' అని కవిత్వం ఒలకపోశాడు.

"మీ ఉద్దేశాలు నాకు నచ్చాయి. ముఖ్యంగా కట్నం తీసుకోరాదన్న మీ ఆదర్శం ఎంతో గొప్పగా ఉంది. ఇకపోతే..." అని ఆగింది శశాంక కళ్లు మిలమిల మెరిసిపోయాయి. 'ఒహ్! ప్రత్యూష గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసినట్టే.' అతని గుండె గదుల్లో ఓ చోట సన్నాయి రాగాలు, మరోవైపు కోయిల మధురరాగాలు మోగనారంభించాయి.

"పెళ్లి అయ్యాక నేను ఉద్యోగం చేయదలచుకోలేదు. హాయిగా ఇంటి పట్టున ఉండి విశ్రాంతి తీసుకోవాలని నా కోరిక."

ప్రత్యూష మాట పూర్తికాకముందే శశాంక తెల్లమొహం వేశాడు. 'అయితే ఇద్దరి జీతాలతో స్వర్గపుటంచుల్లో విహరిద్దామనుకున్న కలలు నీటిబుడగలేనా? తన కిచ్చే జీతంతోనే ఇల్లు గడుపుకోవాలా? మరి కలర్ టీవీ, ఫ్రిజ్, ఇంకా





" 'కుక్క ఉంది జాగ్రత్త' అని బోర్డు పెట్టినా దొంగలు పడ్డారేమిటండీ మరీ విచిత్రం కాకపోతేనూ ..."

"విచిత్రం కాదా మరి - ఆ బోర్డు పెట్టబట్టే కదా దొంగలు అన్ని జాగ్రత్తలూ తీసుకుని మరీ ఇల్లు దోచుకుపోయారు!"

వీలైతే ఓ ఫ్లాటూ ఈ కోరికలన్నీ ఎప్పటికి తీరేను?
ప్రత్యూష చెబుతున్న మిగతా మాటలు అతనికి వినిపించలేదు. ఆమె వైపు పిచ్చి చూపులు చూశాడు.
ఇంతలో అపద్బాంధవుడిలా బస్ వచ్చింది.
"వస్తానండీ! మళ్లీ కలుస్తాను." హీనస్వరంతో టాటా చెప్పేసి బస్ వైపు పరిగెత్తాడు.
బస్‌లో నుంచి కనుమరుగవుతున్న ప్రత్యూష రూపం ఈసారి దేవతలా కాదు. వెయ్యి నాలుకలు చాచుకున్న రక్కసిలా కనిపించింది. అంతే! మర్నాటి నుంచి బస్ స్టాప్‌లో అతని జాడ లేదు.

శశాంక ఉదంతం ప్రత్యూష తన స్నేహితులందరికీ చెబితే పగలబడి నవ్వా రందరూ.
"కొంతమంది తెలివితేటలు ఇంకా అమోఘంగా ఉంటాయి. కట్నం అక్కరలేదని ఆ పార అంతా లాంఛనాలలో లాగుతారు. పైకి కట్నం అడగడం ఈ చదువుకున్న మగవాళ్లకి నామోషి. పెళ్లయిన తర్వాత కనిపించిన ప్రతి ఒక్కరితో నేను కట్నం తీసుకోలేదు సుమండీ అని గొప్పలు చెబుతారు." సుమిత్ర నిట్టూర్చింది.
ఆమె ప్రత్యక్షంగా అలాంటి మొగుడిని కట్టుకుని అతగాడి 'ఫాల్స్ ప్రెస్టేజిని' భరిస్తోంది మరి.
"ఈ మగాళ్లు ఇంతే. అసలు రంగు దాచి కొన్నాళ్లు నాటకాలు ఆడతారు. బుద్ధిమంతులైన అబ్బాయిలని వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు" అంది హేమ. ఆమె కాలేజీలో కెమిస్ట్రీ లెక్చరరుగా పనిచేస్తోంది.
నిజమే! మగవాళ్లలో మంచివాళ్లు అతి తక్కువ మందే ఉంటారు. ప్రత్యూషకి కొలీగ్ ఆదిత్య గుర్తొచ్చాడు. తల వంచుకుని డ్యూటీ చేసి వెళ్లిపోతాడు. బాంక్‌లో కనీసం పాతిక మంది ఆడవాళ్లయినా పనిచేస్తున్నారు. వారి వైపు కన్నెత్తి కూడా చూడడు.
ప్రత్యూష వచ్చి రెండేళ్లవుతున్నా ఎప్పుడు ఆమె వైపు సూటిగా ఒక్కసారి కూడా చూడలేదతను.
ఓసారి ఆఫీసు కాగితాలు ఆమెకి ఇస్తుంటే చేజారి కిందపడిపోయాయి. తిరిగి 'వాటిని ఏరి ఇచ్చేస్తూ "సారీ" అన్నాడు. అతని మాటలు స్వచ్ఛంగా, మృదువుగా ఉన్నాయి.
ఓ రోజు ప్రత్యూష మార్కెట్‌కి వెడితే అక్కడ ఆదిత్య కనిపించాడు. వంకాయలు చాలా జాగ్రత్తగా ఎంచుకుని తూకం వేయించుకుంటున్నాడు. ప్రత్యూష నవ్వుతూ పలకరించబోతే అతను మొహమాటంగా తలదించుకున్నాడు. ఈ చుట్టుపక్కలేనా మీ ఇల్లు' అంది ప్రత్యూష మరింత చొరవగా.
ఆదిత్య ఇక తప్పదన్నట్లు "రండి. మా ఇంటికి" అని పిలిచాడు.
"అడ్రసివ్వండి ఈసారి ఎప్పుడైనా వస్తాను" అని ఆదిత్య ఇంటి వివరాలు తెలుసుకుంది.
ఆదిత్య ఆమె కెప్పుడూ చిత్రంగానే తోస్తాడు! 'ఆడవాళ్లను ఏ నెపంతో పలకరిద్దామా' అని తహతహలాడిపోయే పురుష జాతికి భిన్నంగా ఉండే అతని వ్యక్తిత్వానికి జోహారులు అర్పించింది.
చక్కని వ్యక్తిత్వం, అంతకుమించిన సంస్కారం, మర్యాద ఒలికిస్తూ మృదు సంభాషణ, అతనిలోని సద్గుణాలు ఆమెని కట్టి పడేస్తున్నాయి. ఎంత వద్దనుకున్నా ఆలోచనలు అతనివైపే దారి తీస్తున్నాయి. పరిపూర్ణమైన మగవాడు. సరిగ్గా తన భావాలకి ప్రతిరూపంలా ఉన్నాడు. ఎందుకో అత నింటికి వెళ్లి పరిచయం పెంచుకోవా లనిపించింది.
ఓ ఆదివారం సాయంత్రం స్నానం చేసి, తీరికగా తయారై, తన కిష్టమైన లేత కనకాంబరం రంగు చీర కట్టుకుని ఆదిత్య ఇంటికి వెళ్లింది.
తీరుగా, పొందికగా ఉన్న ఆ ఇంటిని చూసి ముచ్చటపడింది. ఇంటిముందు భాగంలో ఉన్న రకరకాల పూల మొక్కలు ఆమెకి స్వాగతం చెప్పాయి.
ఆదిత్య తల్లి భాగ్యవతమ్మగారు వీధి వరండాలో కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్నారు.
"నమస్కారమండీ! నా పేరు ప్రత్యూష. మీ అబ్బాయీ, నేను ఒకే బాంకులో పనిచేస్తున్నాం." అని పరిచయం చేసుకుంది.




డాక్టరు : [పేషంట్‌తో] "నే చెప్పినట్లు చెయ్యి. రోజూ ఉదయాన్నే గ్లాసుడు వేణ్ణీళ్ళు తాగు!"
"మీరు చెప్పకముందునుంచే రోజూ వేణ్ణీళ్లు తాగుతున్నాను డాక్టరుగారూ! ఎటొచ్చీ మా ఆవిడ అది 'కాఫీ' అంటుంది."

"అలాగా - సంతోషమమ్మా" అని ఆవిడ కొడుకును పిలవడానికి లోపలి కెళ్లింది.
వీధి గదిలో ఉన్న పెయింటింగ్‌లు కాదు ప్రత్యూష దృష్టిని ఆకర్షించింది. లోపల కూర ఏదో తాలింపు పెడుతున్న ఘుమఘుమలు.
"ఏమిటీ? ఆదిత్య ఇంట్లో వంట చేస్తాడా?" ప్రత్యూషకి కుతూహలం పెరిగిపోయింది. చేతిలో ఉన్న కూర గరిటతోనే గబగబా హాల్లోకి వచ్చి ప్రత్యూషని పలకరించా డతను. ప్రత్యూష ఆశ్చర్యం నుంచి ఇంకా కోలుకోలేదు.
మగవాళ్లు ఇంటి పనులు ఇంత శ్రద్ధగా చేయగా చూడటం ఆమెకి ఇదే ప్రథమం. ఒకరిద్దరి స్నేహితురాళ్ల ఇళ్లలో వాళ్ల అన్నలో, తమ్ముళ్లో వంట పనులు చేస్తూండగా తను చూడటం సంభవించింది. అయితే తనను చూడగానే ఏదో చేయరాని పని చేస్తున్నట్లు గబగబా చేతులు కడిగేసుకుని సిగ్గుతో అవతలికి తప్పుకునేవారు. ఆదిత్యలో అలాంటి భావాలేమీ కనబడలేదు.
"మా వాడిని ఎవరు చేసుకుంటారోకానీ అదృష్టవంతులు. కాలు కింద పెట్టనివ్వడు." మురిపెంగా అన్నది భాగ్యవతమ్మ. పొద్దున్నే లేచి ఇల్లు ఊడ్చడం, పాలు తీసుకురావడం, కొళాయి దగ్గర నీళ్లు పట్టడం, చెల్లెలికి కాలేజి టైముకి టిఫిన్ బాక్స్ సిద్ధం చేసి ఇవ్వడం ఈ పనులన్నీ అతడే చేస్తాడంటే విభ్రమంగా వింటూండిపోయింది.
"ఇవన్నీ చేస్తుంటే మీకు నామోషీగా అనిపించదా?"
"ఎందుకు అనిపించాలి? ఈ పనులు ఆడవాళ్లే చేయాలి, ఇవి మగవాళ్లు చేయాలి అనే రూల్స్‌కి కాలం చెల్లిపోయింది. ఈనాడు ఆడపిల్లలు మగవారిని మించి చదువుల్లో, ఉద్యోగాలలో నెగ్గుకు వస్తున్నారు. మా అమ్మ ఎన్నాళ్లు ఇంటి పనులు చేయగలుగుతుంది చెప్పండి? ఈ వయసులో ఆవిడకి విశ్రాంతి అవసరం. ఇక మా చెల్లెలు ఈ పనులన్నీ చేస్తూ ఉంటే ఇక చదువుకోవడానికి టైము ఎలా ఉంటుంది?" అన్నాడు అతి తేలికగా.
ప్రత్యూషకి అతనిపై ఆరాధనా భావం రెట్టింపైంది.
"మీకు పెళ్లయితే ఈ సమస్యలు ఉండవేమో లెండి. మీరు హాయిగా లైబ్రరీకి, సినిమాలకి వెళ్లిపోవచ్చు" అంది కొంటెదనం మిళాయించి.
నిజానికి అతని మనసు లోతులు తెలుసుకోవాలనే ,ఆ ప్రస్తావన తెచ్చింది.
"ఏమో! అప్పుడైనా ఇంటి పనులు చెరిసగం పంచుకోవాలని నా అభిప్రాయం."
"ఒకవేళ ఉద్యోగస్థురాలు మీ భార్యగా వస్తే?"
ఆమె గొంతులో చిలిపితనం గుర్తించి అతను నవ్వాడు.
"ఆడవాళ్లు కేవలం వంటింటికే పరిమితం అయిపోకూడదండి. నలుగురిలో తిరిగితేనే వారికి జీవితం అన్నది అర్థమవుతుంది. మా అమ్మ తీరిక సమయంలో పిల్లలకి పాఠాలు చెబుతుంది. లేదా గుడికో, సినిమాకో వెళ్లి వస్తూ ఉంటుంది. నాలుగు చోట్లకి వెళ్లిరావడం అనేది మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది."
ఇంటికి వచ్చాక కూడా ప్రత్యూష చాలాసేపు అతని గురించే ఆలోచిస్తూ ఉండిపోయింది.
ఎంతమంది మగవాళ్లు ఆదిత్యలా సంస్కారవంతంగా ఆలోచించగలుగుతారు. స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలపై అతనికి ఎంతో అవగాహన ఉంది. చిన్నతనం నుంచి ఆడపిల్లలకి ఇంటిపనులు తగ్గించి పెంచితే చదువులలో మరింత రాణిస్తారు. కొంతమంది మగవాళ్లు కూతుళ్లని అరగారంగా పెంచుతూ భార్యని మాత్రం వంటింటికే కట్టిపెట్టేస్తారు.
ఊపిరాడని ఆ గదిలో, స్టవ్ మంట వేడిలో ఆమె జీవితం ఆవిరి కావల్సిందే!
'మనమూ ఆ పనులలో చేయందుకుని ఆమెకి కొంత విశ్రాంతి నిచ్చి మనసుకి వికాసం కలిగించే జీవితాన్ని ఏర్పరుద్దా'మని ఎంతమందికి ఉంటుంది.
స్త్రీ ఇంటి నుంచి బయటికి రావడ మనేది ఆమెకే సిగ్గు కలిగించే విషయంగా మగవాడు అమోఘంగా సమాజాన్ని మార్చేసి ఏలుతున్నాడు.


అందరూ ఆదిత్యలా ఆడవాళ్లని సాటి మనుషుల్లా గౌరవించి చేయూత ఇచ్చి గడప అవతలి సమాజాన్ని సహృదయతతో చూపగలిగిననాడు - అప్పుడే స్త్రీ జీవితం పరిపూర్ణమవుతుంది. ఆమెలోని సంకుచితత్వం దూరమవుతుంది. పుట్టినప్పటి నుంచి స్త్రీ ఇరుకైన ఇంటిలోనే జీవితకాల మంతా ఉండిపోయి 'సంకుచిత మనస్కురాలు' అని లోకం నుంచి బిరుదును అందుకుంటోంది. అలాటి పరిస్థితులు సమకూర్చుతున్నది పురుషులే.

స్త్రీ అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతూ నాలుగు గోడల మధ్య ఉండిపోతుంటే పురుషుడు ధీమాగా బయట తిరుగుతూ, అన్ని విషయాలు తెలుసుకుంటూ అభివృద్ధికి సోపానాలు వేసుకుంటున్నాడు.

ఆదిత్య లాంటి మగవాళ్లు నూటికీ కోటికీ ఒక్క రుంటారు. ప్రత్యూష అతనిపై తన అనురాగాన్ని అక్షరాలలో పొందుపర్చి అతనికి పోస్టు చేసింది.

"ఆదిత్యగారూ! మీ అపురూపమైన వ్యక్తిత్వం నన్ను ఎంతగానో ఆకర్షించింది. మీ జీవితంలోకి అడుగుపెట్టే అదృష్టం నాకు కలిగిస్తారా?"

మరో వారం రోజులకు ఆదిత్య, ప్రత్యూషల వివాహం జరిగిపోయింది. అట్టహాసాలు లేవు. ఆడంబరాలు లేవు. పదిమంది పెద్దల సమక్షంలో దండలు మార్చుకుని ఇద్దరూ దంపతులయ్యారు. మర్నాడు స్నేహితు లందరినీ పిలిచి అల్పాహార విందు ఇచ్చారు.




"ప్రతి స్త్రీ అత్తవారింటికి వెళ్లితీరాలా?" ప్రత్యూష పెళ్లికి ముందే ఆదిత్యతో మాట్లాడింది.

"అది చాలా పాతకాలం పద్ధతి. పెళ్లి పేరుతో మీ అమ్మగారిని వదిలి వచ్చేయడం అన్యాయం కూడా. అందరం కలిసే ఉందాం" అన్నాడు.

"అయినా ఇబ్బందులు తప్పవు. మీ వాళ్లు మా వాళ్ల మధ్య ఎంతగానో అవగాహన, ప్రేమ ఉంటే తప్ప అది సాధ్యం కాదు" అంది ప్రత్యూష.

"అయితే ఓ ఒప్పందం కుదుర్చుకుందాం. మా అమ్మ చెల్లెలి వైపు నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకునే బాధ్యత నాది... మరి..."

చిరునవ్వుతోనే ఆ మిగిలిన వాక్యాన్ని పూర్తి చేసింది ప్రత్యూష. ★

# లెసిథిన్ వల్ల సంభవించగల ప్రమాదాలు





అనేక కారణాల వల్ల నేడు ఆహారంతోపాటు మరికొన్ని ఇతర పదార్థాలనూ తీసుకోవాల్సి వస్తోంది. ఆహారం విలువ, రుచి రకరకాలుగా ఉపయోగించడానికి అనువుగా ఉండడానికి, లేదా పోషక విలువలు పెంచడానికి ఆహారంలో ఇతర పదార్థాలను కలిపి వినియోగిస్తున్నారు. పశ్చిమ దేశాల్లో ఈ అలవాటు ఎక్కువగా ఉంది. క్రమేణా అభివృద్ధి చెందిన దేశాలకూ విస్తరిస్తోంది. ఆహారంలో కలిపి వాడే అనేక పదార్థాలలో లెసిథిన్ ఒకటి. లెసిథిన్ వినియోగం అంత క్షేమదాయకం కాదని పరిశోధకులు చెబుతున్నారు.

గుడ్లు, సోయాచిక్కుడు, కాలేయం, శిలాఫలాలు తదితరాల నుండి లెసిథిన్ సహజసిద్ధంగా లభిస్తుంది. దీన్ని ఎక్కువగా చాక్లెట్లు, బేకరీ పదార్థాలు, మయోనైజ్‌లో కలుపుతారు. అభివృద్ధి చెందిన దేశాల్లో లెసిథిన్ విస్తృతంగా వినియోగించబడుతోంది. ఈ దేశాల్లో లెసిథిన్‌ను టాబ్లెట్లు, క్యాప్సూల్స్, గ్రాన్యూళ్ల రూపంలో ఉపయోగిస్తున్నారు. ఫ్యాట్ ఎమల్సిఫైయింగ్ ఏజెంట్‌గా దీన్ని జ్ఞాపకశక్తి నష్టపరిచే అల్జిమెర్స్ డిసీజ్ చికిత్సలో కొంత విజయవంతంగా వినియోగించారు.

జోన్‌బెల్ పరిశోధనల ఫలితంగా లెసిథిన్ సప్లిమెంట్‌ను తీసుకునే గర్భవతులు జన్మనిచ్చే శిశువుల్లో మెదడు కణాలు దెబ్బతినే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మెదడులోని ఎంజైమ్‌ల చర్యలలో జరిగే అవకతవకల వల్ల ఇలా జరుగుతుంది. బెల్ అధ్యయనంలో గర్భం దాల్చిన ఎలుకలకు, వాటి సాధారణ ఆహారంలో 5 శాతం లెసిథిన్ ఇచ్చారు. సంతతి ప్రారంభవృద్ధి, యుక్తవయసులో ఎదిగే సమయంలో వాటి రిఫ్లెక్సివ్ బిహేవియర్‌లో అసాధారణ నెమ్మదితనం కనిపించింది. కణాల పెరుగుదల, విభేదనం, రెప్లికేషన్‌ను నియంత్రించే [మెదడులోని] ఎంజైమ్‌ల పరిమాణం తగ్గిపోవడం, సెరబెల్లం ప్రాంతంలో ఎంజైమ్‌ల పరిమాణం పెరగడం గమనించబడింది. దీన్నిబట్టి లెసిథిన్ మెదడులోని నిర్ణీత ప్రాంతాలపై చర్య జరుపుతున్నట్లు అవగతమవుతోంది. ఈ కారణంగా గర్భిణులు లెసిథిన్ వినియోగించడంపై అనేక తీవ్రమైన అనుమానాలు తలెత్తాయి. ఆహారంలో కలిపి వినియోగించే పదార్థాల మంచిచెడులపై విస్తృత, సమగ్ర అధ్యయనాలు జరగాల్సిన అవసరం తేటతెల్లమవుతోంది.

సమ్మెట [హన్మకొండ]